నేడు సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి బోనాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల జాతరకు సర్వం సిద్ధమైంది. ఆషాఢమాస జాతరలో భాగంగా ఆదివారం బోనాలు, సోమవారం రంగం కార్యక్రమం జరుగనుంది. ఈ నేపథ్యంలో జిహెచ్ఎంసి, ఎలక్ట్రిసిటీ, జలమండలి, ఆర్అండ్బి తదితర శాఖల అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

మహంకాళి దేవాలయాన్ని రంగులతో ముస్తాబు చేశారు. దేవాలయం మొత్తం విద్యుత్ దీపాలు, పువ్వులు, పండ్లతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. దేవాలయం చుట్టు పక్కల ప్రాంతాల్లో స్వాగత తోరణాలు, విద్యుత్ దీపాలు పెట్టారు. ఆదివారం ఉదయం 3.30 గంటలకు అమ్మవారికి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కుటుంబ సమేతంగా తొలిపూజ నిర్వహించనున్నారు. అనంతరం హారతిలో పాల్గొంటారు. 4.15 నిమిషాలకు సందర్శకులు దర్శనం చేసుకునేందుకు అనుమతిస్తారు.

ఆరు లైన్లు ఏర్పాటు

బోనాల జాతరకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులూ కలుగకుండా ఆరు లైన్లు ఏర్పాటు చేశారు. ఇందులో ఒకటి పాత రాంగోపాల్పేట్ పోలీస్ స్టేషన్, మరొకటి బాటా వైపు నుంచి ఏర్పాటు చేశారు. అలాగే పాత రాంగోపాల్పేట్ వైపు ఒకటి సాధారణ ప్రజలకు, టొబాకో బజార్ నుంచి దాతల కోసం, అంజలీ థియేటర్ నుంచి వీఐపీ పాస్లతో వచ్చే వారికి ఒకటి, సాధారణ ప్రజల కోసం మరో లైన్ ఏర్పాటు చేశారు. వీవీఐపీలు మాత్రం దేవాలయ ఆరేటు నుంచి నేరుగా లోపలికి వస్తారు. అమ్మవారిని దర్శించుకున్న తర్వాత భయటకు వెళ్లేందుకు గతంలో మూడు గేట్లు ఉండగా.. ఈ ఏడాది అదనంగా మరొక గేటు ఏర్పాటు చేశారు. దేవాలయం చుట్టు పక్కల ఆరు చోట్ల మంచినీటి శిబిరాలు ఏర్పాటు చేసి అందించనున్నారు. ఏడు లక్షల వాటర్ ప్యాకెట్లతో పాటు 250 ఎంఎల్ వాటర్ బాటిళ్లను పంపిణీ చేయనున్నారు. మహంకాళి పోలీస్ స్టేషన్, బొమ్మన బ్రదర్స్, సోలాపూర్ స్వీట్ హౌజ్ ప్రాంతంలో డీఎంఅండ్హెచ్ఓ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. సందర్శకులకు బోనాల జాతర విశిష్టత తెలియజెప్పేలా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో వేదికలు ఏర్పాటు చేశారు. రెండ్రోజుల పాటు కళాకారులు ఆట, పాట జానపదాలతో అలరిస్తారు.

పలుకూ.. మాటా లేదు

- విభజన హామీలపై పెదవి విప్పని మోడీ
- కెసిఆర్ కుటుంబంపై దాడికే అధిక సమయం
- కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ నేతల ముందస్తు అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రధాని నరేంద్ర మోడీ వరంగల్ పర్యటనలో రాష్ట్ర ప్రభుత్వంపైనా, ముఖ్యమంత్రి కెసిఆర్పైనా విమర్శలకే అధిక సమయం కేటాయించారు. రాష్ట్ర విభజన సమయంలో విభజన చట్టంలో కేంద్రం ఇచ్చిన హామీలను మాట మాత్రమైనా ప్రస్తావించలేదు. ఇప్పటికే ఎన్నోసార్లు రాష్ట్రానికి వచ్చిన మోడీ ఈ సారైనా తప్పకుండా మాట్లాడతారని ఆశించిన రాష్ట్ర ప్రజలకు మళ్లీ నిరాశే ఎదురైంది. అవినీతి గురించి బిజెపి నేతలు, ఇతర పార్టీల నేతలు గతంలో చెప్పిన అంశాలనే పునరుద్ఘాటించారు. ప్రధాని పర్యటనలో నిరసన తెలుపుతారనే అనుమానంతో కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ నేతలను ముందస్తుగా అరెస్టు చేసి పోలీసు స్టేషన్లకు తరలించడం విమర్శలకు తావిచ్చింది. విభజన చట్టంలో ఇచ్చిన హామీలపై సభలో మోడీ సమాధానం చెప్పాలని కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే.

ప్రధాని నరేంద్ర మోడీ వరంగల్ పర్యటనలో విభజన చట్టంలో ఇచ్చిన హామీలపై పెదవి విప్పకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర ఏర్పాటులో భాగంగా పార్లమెంటులో ప్రవేశపెట్టిన విభజన చట్టంలో తెలంగాణ రాష్ట్రంలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన విశ్వవిద్యాలయం, బయ్యారంలో స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. ఈ తొమ్మిదేండ్ల కాలంలో కేంద్ర ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేయలేదు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు కేంద్రాన్ని ప్రశ్నించింది. సిఎం కెసిఆర్ సైతం వీటిపై బహిరంగంగానే ప్రశ్నించారు. వామపక్షాలు ఆందోళనలు చేశాయి. విభజన హామీలపై సిపిఎం ఆధ్వర్యంలో బస్సుయాత్ర జరిగింది. రైల్వే కోచ్ ఫ్యాక్టరీకి బదులు కాజీపేటలో వ్యాగన్ తయారీ కేంద్రం నిర్మాణానికి మోడీ శంకుస్థాపన చేయడం గమనార్హం.

విపక్ష నేతల అరెస్టులు

ప్రధాని పర్యటన సందర్భంగా ముందస్తుగా కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ, నేతలను పోలీసులు అరెస్టు చేసి పలు పోలీసుస్టేషన్లకు, మడికొండలోని పోలీసు ట్రైనింగ్ కాలేజీకి తరలించారు. హన్మకొండ డిసిసి అధ్యక్షులు నాయిని రాజేందర్రెడ్డిని, కాంగ్రెస్ నేత జంగా రాఘవరెడ్డిని గృహ నిర్బంధం చేశారు. నేతలను పోలీసు స్టేషన్కు తరలించారు. సిపిఎం వరంగల్ జిల్లా కార్యదర్శి సిహెచ్.రంగయ్య, కార్యదర్శివర్గ సభ్యులు నలిగంటి రత్నమాల, ముక్కెర రామస్వామి, సిపిఎం హన్మకొండ జిల్లా కన్వీనర్ బొట్ల చక్రపాణి, నాయకులు బానోతు, మంద సంపత్, కాడబోయిన లింగయ్య తదితరులను మడికొండ పిటిసికి తరలించారు. ప్రధాని తిరిగి వెళ్లిపోయాక సాయంత్రం 4.00 గంటలకు నేతలను వదిలిపెట్టారు.

బిఎస్ఎన్ఎల్ పరిరక్షణకు పోరాడండి

- బిఎస్ఎన్ఎల్ క్యాజువల్, కాంట్రాక్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఆలిండియా ప్రధాన కార్యదర్శి అన్వేశ్ మిత్ర

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఎస్ఎన్ఎల్ కాంట్రాక్టు కార్మికులు తమ హక్కులు, ఆ సంస్థ పరిరక్షణ కోసం పోరాడాలని బిఎస్ఎన్ఎల్ క్యాజువల్ కాంట్రాక్టు వర్కర్స్ ఫెడరేషన్ ఆలిండియా ప్రధాన కార్యదర్శి అన్వేశ్ మిత్ర పిలునిచ్చారు. హైదరాబాద్లోని బిఎస్ఎన్ఎల్ భవన్లో బిఎస్ఎన్ఎల్ క్యాజువల్ కాంట్రాక్టు వర్కర్ల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు బి.మధు అధ్యక్షతన రాష్ట్ర స్థాయి సదస్సు శనివారం జరిగింది. ఈ సందర్భంగా అన్వేశ్ మిత్ర మాట్లాడుతూ.. బిఎస్ఎన్ఎల్ సంస్థలో కాంట్రాక్టు సిస్టమ్ రద్దు చేశారనీ, సర్వీసు లెవెల్ అగ్రిమెంట్ పద్ధతిలో కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని విమర్శించారు. కాంట్రాక్టు వర్కర్లందరూ కనీస వేతనాల కోసం బిఎస్ఎన్ఎన్లోని ఇతర సంఘాలతో ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సదస్సులో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్, బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ తెలంగాణ సర్కిల్ కార్యదర్శి జి.సాంబశివరావు, కాంట్రాక్టు వర్కర్ల సంఘం జనరల్ సెక్రటరి బి.పరిపూర్ణాచారి, ఎఐబిడిపిఎ సర్కిల్ కార్యదర్శి రామచంద్రుడు, ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్టు వర్కర్ల సంఘం జనరల్ సెక్రటరి కె.ప్రభాకరరావు, రాష్ట్ర అధ్యక్షులు తిరుమలాచార్యులు, ప్రధాన కార్యదర్శి పరిపూర్ణాచారి, బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు నారాయణ, సుశీల్ కుమార్, హరిప్రసాద్, నవీన్, నాయుడు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు

గ్రామ పంచాయతీ కార్మికుల పట్ల నిర్లక్ష్యం తగదు

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామ పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పంచాయతీ కార్మిక ఉద్యోగ, సిబ్బంది యూనియన్ జెఎసి రాష్ట్ర చైర్మన్ పాలడుగు భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కార్మికుల సమ్మె కొనసాగింది. జిపి వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండల కేంద్రంలోని పొట్టి శ్రీరాములు సెంటర్లో చేపట్టిన రిలే నిరవధిక సమ్మె శిబిరాన్ని శనివారం సిఐటియు నాయకులతోపాటు పలు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు సందర్శించి సంపూర్ణ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధిలో, ప్రభుత్వ కార్యక్రమాల్లో విశేషమైన సేవలందిస్తున్న జిపి కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరైందికాదన్నారు. అనేక ఏండ్లుగా అరకొర వేతనాలతో వెట్టి చాకిరీ చేస్తున్న వారి వేతనాలలో మార్పు లేకపోవడం దారుణమన్నారు. ఇకనైనా ప్రభుత్వం వారి న్యాయమైన సమస్యల పరిష్కారానికి ఆలోచన చేయాలని కోరారు.

తల్లాడలో గ్రామ పంచాయతీ కార్మికుల దీక్షా శిబిరాన్ని సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు సందర్శించి మద్దతు తెలిపారు. జీవో నెంబర్ 51 సవరించి మల్టీపర్పస్ పని విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా, ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంఘీభావం తెలిపారు. కొణిజర్లలో సిపిఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు సంఘీభావాన్ని ప్రకటించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో జీపీ కార్మికుల సమ్మెకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సంఘీభావం తెలిపి మాట్లాడారు. సమస్యలు పరిష్కారం అయ్యేవరకు అండగా ఉంటామన్నారు. చర్లలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు సంఘీభావం తెలిపారు.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా పంచాయతీ కార్మికుల సమ్మె మూడో రోజు కొనసాగింది. వికారాబాద్ జిల్లా మోమిన్పేటలో కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన ద్వారా ప్రభుత్వానికి నిరసన తెలిపారు. భువనగిరి మండల ఎంపిడిఒ కార్యాలయం ముందు సమ్మె శిబిరాన్ని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు అనిల్ కుమార్రెడ్డి సందర్శించి మద్దతు తెలిపారు. వలిగొండలో సమ్మెకు భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రాధారపు మల్లేశం మద్దతు తెలిపారు. అడ్డగూడూరు మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులకు చౌళ్లరామారం సర్పంచ్ నిమ్మనగోటి జోజి, లక్ష్మీదేవికాల్వ సర్పంచ్ నారగోని అంజయ్యగౌడ్ మద్దతు తెలిపారు. కార్మికులకు చౌళ్లరామారం సర్పంచ్ నిమ్మనగోటి జోజి రూ.8 వేలు, లక్ష్మీదేవికాల్వ సర్పంచ్ నారగోని అంజయ్యగౌడ్ రూ.5 వేలు విరాళం అందజేశారు. సూర్యాపేట జిల్లా మోతెలో సమ్మె ఐఎఫ్టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి గంట నాగయ్య మద్దతు తెలిపారు. నల్లగొండ ఎంపిడిఒ కార్యాలయం ముందు జిపి కార్మికుల సమ్మెకు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి మద్దతు తెలిపారు.

మోడీ.. ఓ విఫల ప్రధాని

- అత్యధిక నిరుద్యోగం సృష్టించిన ఘనత ఆయనదే
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఎద్దేవా
- ఉడత ఊపులకు భయపడబోమంటూ వ్యాఖ్యలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నరేంద్ర మోడీ.. దేశ చరిత్రలో అత్యంత విఫల ప్రధానిగా మిగిలిపోయారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కెటిఆర్ ఎద్దేవా చేశారు. తొమ్మిదేండ్లలో అత్యధిక నిరుద్యోగం సృష్టించిన ఘనత ఆయనకే దక్కుతుందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని, సిఎం కెసిఆర్ను ఉద్దేశించి ప్రధాని మోడీ వరంగల్ సభలో చేసిన వ్యాఖ్యలపై కెటిఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశంలోని యువత కోసం చేసిన ఒక్క మంచిపనినైనా చెప్పాలంటూ మోడీకి.. ఆయన సవాల్ విసిరారు. గుజరాత్ కోసం రూ.20 వేల కోట్ల పెట్టుబడితో లోకోమోటివ్ ఫ్యాక్టరీని తన్నుకుపోయిన పిఎం... తెలంగాణలో కేవలం రూ.520 కోట్లతో వ్యాగన్ రిపేర్ షాపును పెట్టడం ఇక్కడి ప్రజలను అవమానించటమే అవుతుందని విమర్శించారు. దేశవ్యాప్తంగా ఉన్న 16 లక్షల ఖాళీ పోస్టులను భర్తీ చేయకుండా కేంద్రం చోద్యం చూస్తోందని తెలిపారు. ఈ వాస్తవాన్ని మరుగుపరిచిన మోడీ... రాష్ట్రంలో 2.20 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసిన బిఆర్ఎస్ సర్కార్పై నిందలేయటం శోచనీయమని పేర్కొన్నారు. ఉద్యోగాలడిగితే పకోడీలు వేసుకోవాలంటూ సూచించిన ప్రధాని... యువత గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రజలంతా తమ కుటుంబ సభ్యులనీ, వారి సర్వతోముఖాభివృద్ధికి బిఆర్ఎస్ ప్రభుత్వం పాటుపడుతోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలకు తాము భయపడే ప్రసక్తే లేదన్నారు. ఇలాంటి ఉడత ఊపులకు, పిట్ట బెదిరింపులకు తమ ప్రభుత్వం కలవరపడబోదని వ్యాఖ్యానించారు. తెలంగాణ అభివృద్ధికి, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, వాటిని నెరవేర్చటం కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తామని తెలిపారు.

రైల్వే వ్యాగన్ తయారీ కేంద్రానికి మోడీ శంకుస్థాపన

- పలు రహదారులకు శ్రీకారం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రధానమంత్రి మోడీ శనివారం వరంగల్ పట్టణంలో పర్యటించారు. ముందుగా భద్రకాళి దేవాలయం చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హన్మకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ మైదానానికి చేరుకున్నారు. రూ.521 కోట్లతో తలపెట్టిన కాజీపేట రైల్వే వ్యాగన్ తయారీ కేంద్రానికి, రూ.2,147 కోట్లతో తలపెట్టిన జగిత్యాల, కరీంనగర్, వరంగల్ ఇంటర్ కారిడార్లోని 68 కిలోమీటర్ల కరీంన గర్-వరంగల్ (ఎన్హెచ్ 563) నాలుగు లైన్ల రహదారి నిర్మాణానికి, నాగ్పూర్-విజయవాడ ఎకనామిక్ కారిడార్లో 108 కిలోమీటర్ల మేరకు మంచిర్యాల- వరంగల్ మధ్య రూ.3,441 కోట్లతో తలపెట్టిన నాలుగు లైన్ల రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై సౌందర రాజన్, రాష్ట్ర బిజెపి నూతన ఇన్ఛార్జి ప్రకాశ్ జవదేకర్, మాజీ ఇన్ఛార్జి తరుణ్ చుగ్, జాతీయ ఉపాధ్యక్షులు డికె.అరుణ, ఎన్నికల నిర్వాహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్, ఎంపిలు బండి సంజయ్, ధర్మపురి అరవింద్, సోయం బాబురావు, మాజీ ఎంపీలు జితేందర్రెడ్డి, కొండా విశ్వేశ్వర్రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్రెడ్డి, ఎమ్మెల్యే రఘునందన్రావు తదితరులు పాల్గొన్నారు.

రూ.1.10 లక్షల కోట్ల ప్రాజెక్టులు : కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

తెలంగాణ రాష్ట్రంలో రూ.1.10 లక్షల కోట్ల ప్రాజెక్టులను చేపట్టామని, ఇందులో కొన్ని పూర్తి కాగా, మరికొన్ని పురోగతిలో ఉన్నాయని కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కర్ తెలిపారు. వరంగల్లో మోడీ బహిరంగ సభలో గడ్కరీ మాట్లాడారు. పిఎం గతిశక్తి ద్వారా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. 2024 నాటికి రూ.2 లక్షల కోట్ల ప్రాజెక్టులు పూర్తి చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉత్తరాది, దక్షిణాదిని అనుసంధానిస్తూ రహదారులు నిర్మిస్తున్నామన్నారు. సూరత్ నుంచి హైదరాబాద్, వరంగల్, కర్నూలు మీదుగా రహదారులు నిర్మిస్తున్నామ న్నారు.

ఎందుకు బహిష్కరిస్తున్నవ్ కేసీఆర్..? : మంత్రి కిషన్రెడ్డి

ప్రధాని సభను ఎందుకు బహిష్కరిస్తున్నవో సిఎం కెసిఆర్ చెప్పాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్రెడ్డి డిమాండ్ చేశారు. కాజీపేటలో వ్యాగన్ పరిశ్రమ ఏర్పాటు చేసి మూడు వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న ందుకు సభను బహిష్కరించావా ? అని ప్రశ్నించారు. హైదరాబాద్ నుంచి రెండు వందే భారత్ రైళ్లను ప్రారంభించినందుకు బహిష్కరిస్తున్నావా? సమాధానం చెప్పాలన్నారు. ముందు కల్వకుంట్ల కుటుంబాన్ని బహిష్కరించాలన్నారు.

మహారాష్ట్రతో తెలంగాణది 'రోటీ- బేటీ' బంధం

- ఆ రాష్ట్రం మీదుగా దేశమంతా విస్తరిస్తాం
- బిఆర్ఎస్ జాతీయ అధ్యక్షులు కెసిఆర్
- గులాబీ పార్టీలో చేరిన పలువురు మహారాష్ట్ర నేతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహారాష్ట్రతో తెలంగాణది 'రోటీ-బేటీ' బంధమని బిఆర్ఎస్ జాతీయ అధ్యక్షులు, సిఎం కెసిఆర్ వ్యాఖ్యానించారు.. వెయ్యి కిలోమీటర్ల మేర సరిహద్దును పంచుకుంటున్న రెండు రాష్ట్రాల ప్రజల నడుమ మొదటి నుంచి సామాజిక బాంధవ్యం, సాంస్కృతిక సారూప్యత ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని హామీ ఇచ్చారు. ఇంతటి అనుబంధమున్న మహారాష్ట్ర నుంచే దేశవ్యాప్తంగా బిఆర్ఎస్ను విస్తరిస్తామని తెలిపారు. కేవలం తొమ్మిదేండ్లలో అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ భారతదేశానికి ఆదర్శంగా నిలిచిందనీ, అదే స్ఫూర్తితో మహారాష్ట్రను ప్రగతిపథంలో నడిపించుకుందామని వ్యాఖ్యానించారు. ఆ రాష్ట్రంలో పార్టీల మధ్య జంప్ జిలానీలను ప్రజలు గమనిస్తున్నారంటూ అక్కడి రాజకీయ పార్టీలను ఆయన హెచ్చరించారు. భగత్సింగ్, అల్లూరి సీతారామరాజు లాంటి వారిని ఆదర్శంగా తీసుకుని ప్రజలను చైతన్యవంతులను చేయాలని యువతకు పిలుపునిచ్చారు. శనివారం షోలాపూర్, నాగపూర్ తదితర ప్రాంతాల నుంచి పలువురు నేతలు, ప్రముఖులు తెలంగాణ భవన్లో అధినేత, సిఎం కెసిఆర్ సమక్షంలో పార్టీలో చేరారు. ఆయన వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'దేశంలో అవసరానికి మించి నదీ జలాలు, సహజ సంపదలు ఉన్నాయి. 75 ఏండ్లు గడిచినా ఈ దేశాన్ని పాలించిన పాలకులు వాటిని వినియోగంలోకి తేలేకపోతున్నారు. ప్రపంచంలో మొన్నటి వరకు చైనా వెనుకబడి ఉంది. ప్రస్తుతం ఆ దేశం మనం అందుకోలేనంత అభివృద్ధి చెందింది. దేశాన్ని అభివృద్ధి చేసే ఆలోచనలను కేంద్ర పాలకులు సరైన రీతిలో చేయకపోవడమే అందుకు కారణం. సభ్యదేశాల ముంగిట అంతర్జాతీయ మార్కెట్లో భారతదేశ పరువును కాపాడుకోవాల్సిన అవసరం ఉంది' అని ఆయన తెలిపారు. అభివృద్ధి నిరోధకులకు ఓట్లు వేసుకుంటూ, గెలిపించుకుంటూ, కనీసం తాగునీరు, సాగునీరు, విద్యుత్ వంటి కనీస సౌకర్యాలు లేకుండా ఇంకెన్నాళ్లు అభివృద్ధికి దూరంగా ఉందామని ప్రశ్నించారు. ఇతర దేశాలు అభివృద్ధి చెందుతుంటే మన దేశం ఎందుకు వెనుకబడి ఉందనే విషయంపై ప్రతి ఒక్కరూ ఆలోచించాలనీ, ఇతరులతో చర్చించాలని సూచించారు. ప్రపంచంలోని అనేక అభివృద్ధి చెందిన దేశాలు వ్యవసాయ రంగానికి సబ్సిడీ ఇస్తుంటే, వ్యవసాయాధారిత భారత దేశంలోని పాలకులు అందుకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. బిఆర్ఎస్ రూపంలో ఇంటి గడప ముందుకు అభివృద్ధి వచ్చిందని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులు సహ తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని చూసేందుకు రావాలని వారిని ఆహ్వానించారు.

బంధన్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఫండ్ విడుదల

హైదరాబాద్ : బంధన్ మ్యూచువల్ ఫండ్ కొత్తగా ఒపెన్ ఎండెడ్ ఈక్విటీ స్కీమ్ బంధన్ ఫైనాన్సియల్ సర్వీసెస్ ఫండ్ను విడుదల చేసింది. ఇది పెట్టుబడిదారులకు ఆర్థిక సేవల రంగంలో విస్తృతావకాశాలు కల్పిస్తుందని ఆ సంస్థ తెలిపింది. కొత్త ఫండ్ ఆఫర్ జులై 10న తెరుబడుతుందని.. జులై 24న ముగుస్తుందని పేర్కొంది. పెట్టుబడి లైసెన్స్ పొందిన మ్యూచువల్ ఫండ్ డిస్ట్రిబ్యూటర్లు, ఆన్లైన్ ఆర్థిక ప్లాట్ఫారమ్ల ద్వారా నేరుగా ఈఫండ్ను ఎంచుకోవచ్చని తెలిపింది.

సృజనాత్మకత రచనలు నరసింహపసాద్ సొంతం

- ఆచార్య కొలకలూరి ఇనాక్

ప్రజాశక్తి - కల్చరల్

జన్నాభట్ల నరసింహప్రసాద్ రచించిన వ్యాస మంజూష సంక్షిప్తతతో సృజనాత్మకంగా ఉంటాయని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. శ్రీ త్యాగరాయ గాన సభలోని కళా సుబ్బారావు కళావేదికపై జివిఆర్ కల్చరల్ ఫౌండేషన్ నిర్వహణలో నరసింహప్రసాద్ రచించిన వ్యాస మంజూష సంపుటిని ముఖ్య అతిథిగా ఆచార్య ఇనాక్ పాల్గొని ఆవిష్కరించి మాట్లాడారు. వ్యాసాలలో నిరాడంబరంగా, సున్నితంగా, మనస్సుకు హత్తుకొంటాయని అన్నారు. విమర్శ రచనలు చేసేవారు ఉన్నారుగానీ, వ్యాస రచన చేసేవారు లేరని తెలిపారు. నరసింహప్రసాద్ వ్యాసాలు విరివిగా రాయాలని సూచించారు. నరసింహ ప్రసాద్ రచనలపై పరిశోధన చేసి డాక్టరేట్ పొందిన మట్టా హరికను అభినందిస్తూ పరిశోధనా మెలకువలు తెలిసిన వారని అన్నారు. సాహితీ కిరణం పత్రిక సంపాదకులు పొత్తూరి సుబ్బారావు అధ్యక్షత వహించిన సభలో నేటి నిజం సంపదకుడు బైస దేవ్దాసు సంపుటిలో వ్యాసాలు సమీక్ష చేశారు. నరసింహ ప్రసాద్ తన సంపుటిని లాంఛనంగా హిప్నో పద్మా కమలాకర్కు అకింతమిచ్చారు. నవలా రచయిత ఆచార్య ముదిగొండ శివప్రసాద్ అభినందనలు తెలిపారు. తొలుత సంస్థ నిర్వాహకుడు వెంకటరెడ్డి స్వాగతం పలుకగా హనుమ శాంతి మంత్రం చదివారు.

పోడు పట్టాలివ్వాలి

- వచ్చే ఎన్నికలలో సిర్పూరు నుంచి పోటీ
- ఆర్ఎస్ ప్రవీణ్కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సుప్రీం కోర్టు తీర్పు మేరకు పోడు పట్టాలు పంపిణీ చేయాలని, పోడు పట్టాల విషయంలో సుప్రీం తీర్పును సిఎం కెసిఆర్ ఎందుకు పరిగణలోనికి తీసుకోవడం లేదని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎస్ ప్రవీణ్కుమార్ ప్రశ్నించారు. బహుజన రాజ్యాధికార యాత్ర నాలుగో విడతలో భాగంగా ఆయన శుక్రవారం ఆసిఫాబాద్ - కొమురం భీం జిల్లా కాగజ్నగర్కు వచ్చారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2006 అటవీ హక్కుల చట్టానికి ముందు నుంచి సాగులో ఉంటున్న గిరిజనేతరులకు కూడా పోడు పట్టాలు అందించాలని గతంలోనే సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందని, ఈ తీర్పును పరిగణలోనికి తీసుకొని పోడు సాగు చేస్తున్న అందరికీ పట్టాలు అందించాలని డిమాండ్ చేశారు.

In the court of the III Addl. District Judge :: Nellore, A.P.
E.P. No. 1044 / 2022
O.S.No. 150 / 2017
Kukati Srinadh Reddy - D.Hr / Plaintiff
Vs
1. Devarakonda Prabhavathi
2.Devarakonda Nishanth
- J.Drs/ Defendants

Notice to 2nd JDR
Devarakonda Nishanth, S/o Late **Mohan,** Presently residing at D110480421SE IDCI, SYNo.115, Wave Rock Building, Nanakramguda, Gachibouli, Hyderabad, Telangana State.

పై నెంబరున డిక్రీ హోల్డర్ పైన తెలిపిన కోర్టులో మీపై E.P. దాఖలు చేసియున్నారు. సదరు E.P. లో మీకు ఆర్డర్ 21 రూల్ 22 నోటీసు నిమిత్తం **తే13-07-2023దికి** వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు **ఉదయం 10.30 గంటలకు** మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పైన తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

పి.ఉమామహేశ్వర్, బి.కాం., బి.ఎల్.,
డిక్రీహోల్డర్ తరపు అడ్వకేట్, నెల్లూరు.

IN THE COURT OF HON'BLE XXV ADDI CHIEF JUDGE CUM MACT CITY CIVIL COURT AT:HYDERABAD
O.P.NO.1054 OF 2022
BETWEEN:
G.Ganesh Kumar and Others.
...Petitioner
AND
Shaik Faraz Nusrath and Others.
....Respondent
To,
1.Jitender Kumar, S/o.Darshan Singh,
Occ:Driver of Crime Vehicle,
R/o.Gurunanak Nagar,Bahodapur,
Gwalior M.P.
..................R3

Please take Notice that the above named Petitioner filed above O P against you and other for Compensation, Praying that the Hon'ble court for grant of compensation in favor of the petitioner. The Hon'ble Court posted the above case on 03 /08/2023.at 10.30 am for your appearance either in person or through an advocate, failing which the case will be heard and decided on merits in your absence.

(BY ORDER OF COURT)
Sri.Ravi Krishna Kumar,
Advocate
Saidabad, Hyderabad.

త్వరలో అందుబాటులోకి స్టీల్ బ్రిడ్జి

- నగరంలో తీరనున్న ట్రాఫిక్ కష్టాలు
- ఇందిరాపార్కు టూ విఎస్టి వరకు నాలుగు లైన్ల స్టీల్ బ్రిడ్జి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదారబాద్ నగరవాసులకు త్వరలో స్టీల్ బ్రిడ్జి అందుబాటులోకి రానుంది. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలను అధిగమించేందుకు ఎస్ఆర్డిపి చేపట్టిన పనులు ఒక్కొక్కటి అందుబాటులోకి వస్తున్నాయి. ఈ క్రమంలో ఇందిరాపార్కు టూ విఎస్టి వరకు నిర్మిస్తున్న స్టీల్ బ్రిడ్జి త్వరలోనే అందుబాటులోకి రానుంది. ఈ బ్రిడ్జి వినియోగంలోకి వస్తే ఇందిరాపార్కు నుంచి విద్యానగర్నగర్ వరకు ట్రాఫిక్ కష్టాలు తీరడంతోపాటు విఎస్టి నుంచి లక్డీకాపూల్ వైపు ప్రయాణికులకు ఇప్పుడున్న అడ్డంకులు తగ్గే అవకాశాలున్నాయి.

2.8 కిలో మీటర్లు, రూ.3.50 కోట్లు

నగరంలో సిగ్నల్ రహిత ప్రయాణాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు సర్కారు అమలు చేస్తున్న ఎస్ఆర్డిపి కార్యక్రమం సుమారు రూ.350 కోట్లతో ఇందిరాపార్కు నుంచి ఆర్టిసి క్రాస్ రోడ్డులో విఎస్టి వరకు (ఆజామాబాద్ మీదుగా) చేపట్టిన స్టీల్ బ్రిడ్జి ఏర్పాటు పనులు తుది దశకు చేరుకున్నాయి. 2.8 కిలో మీటర్లు, నాలుగు లైన్లుగా స్టీల్తో నిర్మించిన ఈ బ్రిడ్జి పనులు ఈ నెలాఖరు వరకు పూర్తి కానున్నట్టు సమాచారం. బ్రిడ్జి పనులు పూర్తి కాగా, బ్రిడ్జిపై బిటి రోడ్డు వేసే పనులను జిహెచ్ఎంసి అధికారులు చేస్తున్నారు. ఈ నెలాఖరులోగానీ, వచ్చే నెల మొదటి వారంలోగానీ బ్రిడ్జిని ప్రారంభించేందుకు మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ అపాయింట్మెంట్ తీసుకోవాలని జిహెచ్ఎంసి అధికారులు భావిస్తున్నారు. 81 స్టీల్ పిల్లర్లతో ఎంవిఆర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ సంస్థ ఈ స్టీల్ బ్రిడ్జి పనులు చేపట్టింది. ఈ బ్రిడ్జి అందుబాటులోకి వస్తే ఇందిరాపార్కు జంక్షన్తోపాటు అశోక్నగర్ చౌరస్తా, ఆర్టీసీ క్రాస్ రోడ్, విఎస్టి మెయిన్ రోడ్డులో కూడా ట్రాఫిక్ తగ్గుతుంది.

ఆర్టిసి క్రాస్రోడ్డులో ట్రాఫిక్ సులభతరం

ఇందిరాపార్కు, విద్యానగర్ ప్రాంతాల్లో ట్రాఫిక్ కష్టాలు త్వరలోనే తీరనున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డు ప్రస్తుతం వాహనాలతో కిక్కిరిసిపోతుంది. ఐదు కిలో మీటర్ల దూరానికి గంటల తరబడి ప్రయాణించాల్సి వచ్చేది. ఉదయం 9 నుంచి 10:30 గంటల వరకు, సాయంత్రం 3:30 గంటల నుంచి రాత్రి 9 వరకు ట్రాఫిక్ ఇబ్బందులు చెప్పనక్కర్లేదు. ఇందిరాపార్కు నుంచి వీఎస్టీ వరకు దాదాపు రూ.350 కోట్లతో నిర్మిస్తున్న స్టీల్ బ్రిడ్జి అందుబాటులోకి వస్తే ట్రాఫిక్ సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది. ముఖ్యంగా ఆర్టీసీ క్రాస్రోడ్, అశోక్నగర్లో ట్రాఫిక్ సులభతరం అవుతుంది.

రోడ్డు ప్రమాదంలో నలుగురు దుర్మరణం

- ఐదుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలంలోని మేకలగండి వద్ద శనివారం తెల్లవారుజామున 44వ జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం జరిగింది. ఆటోను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న తొమ్మిది మందిలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మిగతా వారికి తీవ్రగాయాలయ్యాయి. వారు రిమ్స్లో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఇచ్చోడ పోలీస్ స్టేషన్ ఇన్చార్జి సిఐ కిరణ్ కుమార్ వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రవీంద్రనగర్కు చెందిన తొమ్మిది మంది ఆటోలో శుక్రవారం ఇచ్చోడలోని ఓ చర్చికి వెళ్లారు. అనంతరం శనివారం తెల్లవారుజామున అదే ఆటోలో ఆదిలాబాద్కు తిరుగు ప్రయాణమయ్యారు. గుడిహత్నూర్ మండలం చింతగూడ బస్టాప్ సమీపంలోని మేకలగండి వద్ద గుర్తు తెలియని ఓ వాహనం అతివేగంగా ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో నుజ్జునుజ్జయి నాలాలో ఇరుక్కుంది. అటుగా వెళ్తున్న స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. అప్పటికే శైలజ (35), పొచ్చన్న (65) సలోమీ (62), గంగు (50) అక్కడికక్కడే మృతిచెందారు. వీరిలో పొచ్చన్న, గంగు, శైలజ ఒకే కుటుంబానికి చెందినవారు. కాగా మడవి ప్రేమ్సాగర్, మడవి దీపక్, తేజ వర్ధన్, ఆరాధ్య, చిన్నికి తీవ్రగాయాలయ్యాయి. వారందరినీ రిమ్స్కు తరలించారు. వీరిలోక కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి చేసి కుటుంబీకులకు అప్పగించారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి అంత్యక్రియలను వారి స్వగ్రామమైన ఇంద్రవెల్లి మండలం కేస్లాగూడలో పూర్తి చేశారు. ప్రమాదానికి సంబంధించి జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్రెడ్డి పర్యవేక్షణలో మూడు బృందాలు దర్యాప్తు చేస్తున్నాయి. ప్రమాదానికి కారణమైన గుర్తుతెలియని వాహనాన్ని పట్టుకునేందుకు సీసీ ఫుటేజ్, టెక్నికల్ టీంతో కలిసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వెల్లడించారు.

విభజన హామీల ప్రస్తావనేది?

- తెలంగాణను మోసగించిన ప్రధాని
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర విభజన హామీల ప్రస్తావన చేయకుండా తెలంగాణ ప్రజలను ప్రధాన మంత్రి నరేంద్రమోడీ మరోసారి మోసగించారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. శనివారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విభజన చట్టం హామీల మేరకు కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సి ఉండగా అటకెక్కించిందని తెలిపారు. తొమ్మిదేండ్ల తర్వాత వ్యాగన్ వర్క్‌షాపునకు శంఖుస్థాపన చేయడమంటే..ప్రజల్ని మోసగించడమేననీ, మోడీ పర్యటన రానున్న ఎన్నికలలో ఓట్ల కోసమే తప్ప తెలంగాణ కోసం కాదని విమర్శించారు. 'మోడీ పర్యటన సందర్భంగా విభజన చట్టం హామీల గురించి ప్రస్తావిస్తారని రాష్ట్ర ప్రజలు ఆశించారు. వరంగల్‌కు రైల్వే కోచ్ ఫ్యాక్టరీని కేటాయించినప్పటికీ ఆ ఫ్యాక్టరీని తన సొంత రాష్ట్రమైన గుజరాత్‌కు తరలించుకుపోయి తెలంగాణకు తీరని అన్యాయం చేసిన ఘనుడు నరేంద్ర మోడీ. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, ట్రైబల్ యూనివర్సిటీ, ఐటీఐఆర్ ప్రాజెక్టు గురించి మాట మాత్రమైనా ప్రస్తావించలేదు. తెలుగు రాష్ట్రాల మధ్య నీటి పంపిణీ చేయకుండా, కృష్ణా-గోదావరి బోర్డును ఏర్పాటు చేయడం ద్వారా కేంద్రం రాష్ట్రాల మధ్య తగాదాను పెంచింది. ఒక్క ప్రాజెక్టుకు కూడా జాతీయ ప్రాజెక్టు హోదా ఇవ్వలేదు. రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులను కేంద్రం తన అధీనంలోకి తీసుకుంటూ గెజిట్ పబ్లికేషన్ చేసింది. రెండు రాష్ట్రాల మధ్య ఉన్న విద్యుత్తు ఉత్పత్తి, ఆస్తుల పంపిణీకి పరిష్కారం చూపలేదు. ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తానన్న నరేంద్ర మోడీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాలు భర్తీ చేయడంలేదని మాట్లాటం హాస్యాస్పదం. ఉపాధి హామీ చట్టానికి నిధులు తగ్గించి కేంద్ర ప్రభుత్వం కూలీల పొట్ట కొడుతున్నది. మోడీ ప్రకటించిన రైతు ఉత్పత్తుల కనీస మద్దతు ధరలు కార్పొరేట్లకు లాభం చేయడానికే తప్ప అందులో శాస్త్రీయత లేదు. తొమ్మిదేండ్లుగా రాష్ట్రం ప్రకృతి వైపరీత్యాలతో అతలాకుతలమై రూ.32వేల కోట్లు నష్టపోగా కేంద్రం కక్షపూరితంగా ఎలాంటి సహాయమూ చేయలేదు. తక్కువ నష్టం జరిగినా బిజెపి పాలిత రాష్ట్రాలకు మాత్రం నిధులు కేటాయించింది. ఇప్పటికైనా రాష్ట్రానికి రావాల్సిన నిధులును వెంటనే విడుదల చేయాలి. విభజన చట్టంలోని హామీలను అమలు చేయాలి' అని తమ్మినేని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌కు సన్మానం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఎంపికైన రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ను తెలంగాణ న్యాయమూర్తుల సంఘం ఘనంగా సన్మానించింది. శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సంఘం ప్రతినిధులు భుయాన్‌ను కలుసుకుని అభినందనలు తెలిపారు. తెలంగాణ హైకోర్టు ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 33 జిల్లాలకు జిల్లా న్యాయస్థానాలను, జిల్లా న్యాయ సేవాధికార సంస్థలను ఏర్పాటు చేయడంలో ఆయన చేసిన కృషిని న్యాయమూర్తుల సంఘం ఈ సందర్భంగా అభినందించింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ న్యాయమూర్తుల సంఘం అధ్యక్షులు, హైకోర్టు రిజిస్ట్రార్ నందికొండ నర్సింగ్‌రావు, ఉపాధ్యక్షులు సుదర్శన్, ప్రధాన కార్యదర్శి కె.మురళీమోహన్, సహాయ కార్యదర్శి ఉపేందర్ రావు, కార్యవర్గ సభ్యులు మంద వెంకటేశ్వరరావు, జలీల్, రాజు, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు. న్యాయమూర్తుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి సహకరించినందుకు రాష్ట్ర న్యాయమూర్తుల తరపున వారు భుయాన్‌కు ధన్యవాదాలు తెలిపారు.

ఆయన వ్యాఖ్యలు దిగజారుడు తనానికి నిదర్శనం

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వివిధ సంక్షేమ పథకాలతో దేశంలోనే ఆదర్శ పాలన సాగిస్తున్న కెసిఆర్‌పై అవినీతి, కుటుంబ పాలన అంటూ.. ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలు ఆయన దిగజారుడు తనానికి నిదర్శనమని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ విమర్శించారు. అంబర్‌పేటలో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మోడీ వ్యాఖ్యలను ఖండించారు. విభజన హామీలు అమలు చేయలేని ప్రధాని రాష్ట్రానికి వచ్చిన ప్రతిసారి ఇక్కడి ప్రభుత్వంపై అవాకులు చవాకులు పేలడం, అసత్యాలు మాట్లాడడం అలవాటుగా మారిందని విమర్శించారు. రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన వర్సిటీ, నది జలాల పంపిణీ పై తేల్చకుండా ఉత్త చేతులతో వెళ్తున్నారు. రైతులు పేదల అభివృద్ధికి సిఎం కెసిఆర్ ఉచిత విద్యుత్, రైతు బీమా, రుణమాఫీ కల్యాణ లక్ష్మి పథకాలతో ఆదర్శ పాలన సాగిస్తున్నరని, అధికార దాహంతో ప్రజల మధ్య విభేదాలు సృష్టించే బిజెపికి రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కోరారు.

నిరసనలు తెలుపుతున్న డివైఎఫ్ఐ నాయకులు

ప్రధాని పర్యటనపై నిరసనలు

- డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మలు దగ్ధం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర విభజన హామీలను అమలు చేయకుండా తెలంగాణలో అడుగుపెట్టే అర్హత ప్రధాని నరేంద్ర మోడీకి లేదని డి వైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోటరమేష్, ఆనగంటి వెంకటేష్ అన్నారు. విభజన చట్టంలో తెలంగాణకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ శనివారం డివైఎఫ్ఐ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా హైదరాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య పార్క్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కోట రమేష్ మాట్లాడుతూ.. రాష్ట్ర పునర్విభజన చట్టం హామీల్లో ఉన్న కాజీపేట కోచ్ ఫ్యాక్టరీకి కేంద్ర ప్రభుత్వం మొండి చెయ్యి చూపిందన్నారు. ఆనగంటి వెంకటేష్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా రాష్ట్ర విభజన చట్టం హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఖమ్మం జిల్లా కేంద్రంలో ప్రధాని మోడీ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ముందుగా మోడీ దిష్టి బొమ్మతో ర్యాలీ నిర్వహించారు. మోడీ గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. వైరా, కల్లూరు, మధిరలో దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. రాష్ట్ర విభజన హామీలు అమలు చేయకుండా రాష్ట్రంలో ప్రధాని మోడీ పర్యటించడాన్ని నిరసిస్తూ సూర్యాపేట జిల్లా కేంద్రంలో నల్లాల బావి సెంటర్‌లో ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. యాదాద్రి జిల్లాలోని బీబీనగర్‌లో మండలంలో ప్రధాని మోడీ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు.

ఆశా వర్కర్లపై హరీశ్‌రావు వ్యాఖ్యలను ఖండిస్తున్నాం : సిఐటియు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణలోనే అత్యధిక పారితోషికాలు ఇస్తున్నామని మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలు సరిగాదనీ, వాటిని ఖండిస్తున్నామని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) పేర్కొంది. శనివారం ఈ మేరకు ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పి.జయలక్ష్మి, ప్రధాన కార్యదర్శి ఆర్.నీలాదేవీ, కోశాధికారి పి.గంగమణి ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రం ఏర్పడి తొమ్మిదేండ్లు దాటినా నేటికీ రాష్ట్రంలో ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించలేదని విమర్శించారు. హర్యానాలో రూ.12 వేలు, ఆంధ్రప్రదేశ్‌లో రూ.10 వేల ఫిక్స్‌డ్ వేతనం ఇస్తున్నారని గుర్తు చేశారు. అనేక రాష్ట్రాల్లో ఎఎన్ఎమ్ నియామకాల్లో ఆశాలకు ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. చాలా రాష్ట్రాల్లో ఆశా వర్కర్లకు సైకిళ్ళు కూడా ఇచ్చారని గుర్తు చేశారు. రాష్ట్రంలో మాత్రం కనీసం 32 రకాల రిజిష్టర్లను కూడా ప్రభుత్వం ఇవ్వలేదని విమర్శించారు. పీఆర్సీలో భాగంగా పెంచిన ఏడు నెలల ఎరియర్స్‌ను నేటికీ అకౌంట్‌లో వేయలేదని తెలిపారు. కరోనా రిస్కు కింద 16 నెలలకుగానూ కేంద్రం ఇచ్చిన రూ.16 వేలను ఒక్క ఆశావర్కర్‌కు కూడా చెల్లించలేదని విమర్శించారు. పని భారాన్ని విపరీతంగా పెంచుతున్నదనీ, పనిచేయని సెల్ ఫోన్లు ఇచ్చి నిరంతరం ఆన్‌లైన్‌లో పనిచేయాలని ఒత్తిడి చేస్తున్నదని తెలిపారు. మొబైల్ శిక్షణ కోసం ఒక్కొక్క ఆశావర్కర్‌కు రూ.50 వేలు ఖర్చు పెడుతున్నామని ప్రభుత్వం గొప్పలు చెప్పడం మానేసి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆశావర్కర్లకు కనీసం రూ.18 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలనీ, పని భారం తగ్గించాలనీ, 5జి టెక్నాలజీ మొబైల్‌ను అందించాలని కోరారు.

ఇది మహిళా వ్యతిరేక ప్రభుత్వం..

- మోడీ హయాంలో యథేచ్ఛగా హింస
- మణిపూర్ చిచ్చుకు బిజెపియే కారణం
- ఐద్వా జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మరియం ధావలే, పికె శ్రీమతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మహిళా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నదని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మరియం ధావలే, పికె శ్రీమతి విమర్శించారు. ఆ సంఘం జాతీయ కమిటీ సమావేశాలు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. రెండో రోజైన శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్ పుణ్యవతి, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ అరుణజ్యోతి, మల్లు లక్ష్మితో కలిసి వారు మాట్లాడారు. మోడీ తొమ్మిదేండ్ల పాలనలో మహిళల అభివృద్ధిని మరింత వెనక్కు నెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. మనిషి బతకటానికి కూడు, గూడు, గుడ్డ కనీస అవసరమని చెప్పారు. పేదల మౌలిక అవసరాలు తీర్చలేని సర్కార్ ఎవరి కోసం పనిచేస్తున్నదని ప్రశ్నించారు. తినటానికి తిండిలేక, సరైన పౌష్టికాహారం లేక మహిళలు రోగాలు, నొప్పులు, రక్తహీనతతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆహార ధాన్యాలను సరఫరా చేయటంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కరోనా కాలంలో ఉచితంగా 5 కిలోల బియ్యం ఇచ్చారనీ, ఇప్పుడు అనేక రాష్ట్రాల్లో ఉచిత బియ్యం, గోదుమలు, ఇతర సరుకుల పథకాన్ని ఎత్తేశారని వివరించారు. పేదలకు కావాల్సిన కనీస అవసరాలను తీర్చలేని మోడీ ప్రభుత్వం మహిళలు, దళితులు, ఇతర తరగతులపై హింసను ప్రేరేపిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. బ్రిజ్‌భూషణ్ వ్యవహారంపై అంతపెద్ద పోరాటం జరిగినా ఈ ప్రభుత్వం స్పందించలేదంటే ప్రభుత్వం మహిళల పట్ల ఎంత మొండిగా వ్యవహరిస్తున్నదో అర్థమవుతున్నదని చెప్పారు. మణిపూర్‌లో కుకీలకు, మైటీలకు మధ్య మంటపెట్టింది బిజెపి సర్కారేనని తెలిపారు. దీంతో అక్కడ ఎంతో మంది అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారనీ, గాయాల పాలవుతున్నారనీ, వేల మంది రోడ్డుపాలయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. వీరి విభజన రాజకీయాల్లో మహిళలు సమిథలవుతున్నారని చెప్పారు. ఈ పాపం బీజేపీ ప్రభుత్వానిదేనని విమర్శించారు. మరో పక్క కులాంతర వివాహాలు చేసుకున్న దంపతులను అత్యంత దారుణంగా హత్య చేస్తున్నారని వివరించారు. పాఠ్యపుస్తకాల్లో ఆధ్యాత్మిక భావాజాలాన్ని జొప్పించటమేగాక, డార్విన్ సిద్ధాంతాన్ని తొలగిస్తున్నారని చెప్పారు. ఉమ్మడి పౌరస్మృతిని సమానత్వం కోసం తీసుకొస్తున్నామంటూ నమ్మబలుకుతున్నారనీ, ఇదంతా పచ్చి మోసమని విమర్శించారు. వాస్తవంగా ఉమ్మడి పౌరస్మృతి లక్ష్యం వేరుగా ఉందని చెప్పారు. దేశంలో 40 శాతం మంది జనాలు ఆకలి, దారిద్ర్యంతో అల్లాడిపోతున్నారన్నారని గుర్తు చేశారు. దేశంలో నిరుద్యోగం రాజ్యమేలుతున్నదని చెప్పారు. వీటి గురించి మాట్లాడకుండా.. యుసిసి గురించి ప్రధాని ప్రస్తావించడం అత్యంత శోచనీయమని అన్నారు. ఇది లౌకిక దేశమని చెప్పారు. ఇక్కడ అనేక మతాలు, జాతులు, సంస్కృతులు, సంప్రదాయాలు, జీవన విధానాలున్నాయన్నారు. వీటన్నింటిని కాదని యుసిసిని తీసుకురావటమేంటని ప్రశ్నించారు.

మల్లు లక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో ఇళ్లు, ఇళ్ల స్థలాలు లేని ప్రజలు గణనీయంగా ఉన్నారని చెప్పారు. వారు ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్నారని తెలిపారు. వారికి వెంటనే పక్కా ఇండ్ల నిర్మాణాలు చేపట్టాలనీ, పట్టాల పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. పేదలపై ప్రభుత్వం పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.కేరళ తరహాలో 14రకాల నిత్యావసర వస్తువులు అందించాలన్నారు. మహిళా పారిశ్రామిక కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ రుణాలు ప్రియం

- వడ్డీ రేట్ల పెంపు

న్యూఢిల్లీ : ప్రయివేటు రంగంలో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ తమ వినియోగదారులకు షాక్ ఇచ్చింది. ఆ బ్యాంక్ రుణాలపై వసూలు చేసే వడ్డీ రేట్లను పెంచింది. ఇటీవలే హెచ్‌డిఎఫ్‌సిని విలీనం చేసుకున్న హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ తాజా నిర్ణయంతో లక్షలాది మంది ఖాతాదారులపై ప్రభావం పడనుంది. బెంచ్‌మార్క్ మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేట్లను (ఎంసిఎల్ఆర్) 15 బేసిస్ పాయింట్ల వరకు పెంచింది. పెంచిన వడ్డీ రేట్లు శుక్రవారం నుంచి అమల్లోకి వచ్చాయి. ఈ నిర్ణయంతో గృహ, వ్యక్తిగత, వాహన, రిటైల్ రుణ గ్రహీతలపై భారం పడనుంది. వారు చెల్లించే ఇఎంఐ పెరగనుంది. కొత్త వడ్డీ రేట్ల వివరాలు.. ఓవర్ నైట్ ఎంసిఎల్ఆర్ రేటు 15 బేసిస్ పాయింట్లు పెరిగింది. దీంతో ఈ రేటు 8.1 శాతం నుంచి 8.25 శాతానికి చేరింది. నెల రోజుల ఎంసిఎల్ఆర్ రేటు కూడా 10 బేసిస్ పాయింట్లు పెంచడంతో 8.2 శాతం నుంచి 8.3 శాతానికి చేర్చింది. మూడు నెలలపై వడ్డీరేటు 10 బేసిస్ పాయింట్లు పెరిగి 8.5 శాతం నుంచి 8.6 శాతంగా ప్రకటించింది. ఆరు నెలల ఎంసిఎల్ఆర్‌ను 5 బేసిస్ పాయింట్లు పెంచి 8.85 శాతం నుంచి 8.9 శాతానికి చేర్చింది. ఏడాది ఆపైన వ్యవధి రుణాలపై వడ్డీరేటును 9.05 శాతం వద్ద కొనసాగించాలని నిర్ణయించింది. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, హెచ్‌డిఎఫ్‌సిలు జులై 1వ తేది నుంచి అమల్లోకి వచ్చింది. దీంతో రూ.18 లక్షల కోట్ల ఆస్తులతో ఒక దిగ్గజ సంస్థగా హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌గా ఏర్పాటు అయ్యింది. విలీనం అనంతరం 12 కోట్ల ఖాతాదారులు, 8,300 బ్యాంకు శాఖలు, 1.77 లక్షల మంది ఉద్యోగులతో కూడిన అతిపెద్ద బ్యాంకుగా ఆవిర్భవించింది.

పాలకుల ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పాలకులు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించి చైతన్యపరచాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని సిపిఎం కార్యాలయంలో నియోజవర్గస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చేందుకు యత్నిస్తుందని, అందులో భాగంగానే ప్రతిపక్షాలను నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలపై భారాలను మోపుతున్న బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు విపక్షాలు ఏకమవుతున్నాయని తెలిపారు. ప్రతిపక్ష పార్టీలు ఒక వేదిపైకి వచ్చి బిజెపిని గద్దె దించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయని చెప్పారు. దీనికి అన్ని వర్గాల ప్రజలు మద్దతు తెలపాలని కోరారు. కర్ణాటక ఫలితాలు, కాంగ్రెస్‌లో పొంగులేటి చేరికతో తెలంగాణలో కాంగ్రెస్‌కు కొంత ఊపు తీసుకొచ్చిందన్నారు.

దీంతో రాష్ట్రంలో బిఆర్ఎస్- కాంగ్రెస్ మధ్య పోటీ ఉంటుందని ప్రజలు భావిస్తున్నారని, కానీ వరంగల్‌లో మోడీ సభతో తాము కూడా పోటీలో ఉన్నట్లు బిజెపి నేతలు ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణలో బిజెపికి అవకాశం ఇవ్వొద్దన్నారు. ప్రజా సమస్యల కోసం పోరాటాల నిర్వహించే వామపక్ష పార్టీలకు ప్రజలు అండగా నిలవాలని కోరారు. ఎన్నికలకు ముందు సిఎం కెసిఆర్ ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలని, వాటి అమలు కోసం భవిష్యత్‌లో ప్రజా ఉద్యమాలు చేస్తామని తెలిపారు. కమ్యూనిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికులుగా పనిచేసి గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేశ్, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి డాక్టర్ మల్లు గౌతమ్‌రెడ్డి, తిరుపతి, రామ్మూర్తి, భావండ్ల పాండు, రాగిరెడ్డి మంగారెడ్డి, రెమిడాల పరుశరాములు, ఐద్వా జిల్లా అధ్యక్షులు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు రూ.26 వేల కనీస వేతనమివ్వాలి

- వలస కార్మిక చట్టాన్ని అమలు చేయాలి
- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, మల్లికార్జున్
- గుమ్మడిదల, ఐడిఎ బొల్లారం మండలాల్లో జీపుజాతా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పారిశ్రామికవాడలో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, మల్లికార్జున్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్ర వ్యాప్త జీపుజాతా శనివారం సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం బొంతపల్లి పారిశ్రామిక ప్రాంతంలో, జిన్నారం, ఐడిఎ బొల్లారం మండలాల్లోని ఖాజీపల్లి, గడ్డపోతారం ప్రాంతాల్లో పర్యటించింది. బొంతపల్లి పారిశ్రామికవాడలోని ధనలక్ష్మి స్టీల్ పరిశ్రమ, గ్రాండ్ న్యూల్స్, హెటిరో యూనిట్ -1, ఎంఎస్ఎన్, ఖాజీపల్లి, గడ్డపోతారం ప్రాంతాల్లోని అరబిందో, హెటిరో డ్రగ్స్, లీ ఫార్మా, ఎస్ఎంఎస్ పరిశ్రమల దగ్గర నిర్వహించిన సభల్లో భూపాల్, మల్లికార్జున్ కార్మికులనుద్దేశించి మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనం అమలు చేయకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. 2014 నుంచి కనీస వేతనాన్ని అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని విమర్శించారు. పారిశ్రామిక ప్రాంతంలో పని చేస్తున్న కార్మికులు ఇఎస్ఐ, పిఎఫ్, సెలవులు, ఓటి డబుల్, యూనిఫామ్, బూట్లు క్యాంటీన్, ప్రమాదం తర్వాత ఆదుకోవడం తదితర సౌకర్యాలు లేక ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ధనలక్ష్మి స్టీల్ పరిశ్రమలో బీహార్, ఇతర రాష్ట్రాల కార్మికులకు సరియైన సేఫ్టీ పరికరాలు ఇవ్వకుండా 12 గంటలు పనులు చేయిస్తున్నారని చెప్పారు. వలస వచ్చిన కార్మికులను రేకుల షెడ్డులో ఉంచుతున్నారని.. వారికి అనువైన ప్రదేశాల్లో ఇండ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. వలస కార్మికుల చట్టాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు వలస కార్మికుల గదులను పరిశీలించారు. విద్యుత్, నీటి సౌకర్యం, వాష్ రూమ్‌లో ఎటువంటి సౌకర్యాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ధరల భారంతో కార్మికులు అతలాకుతలమవుతున్నా.. ప్రభుత్వాలు కనీస వేతనాన్ని అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. వెంటనే సీనియార్టీ ప్రకారం అర్హులైన కార్మికులకు వేతనాలు పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 17న జిల్లా కలెక్టరేట్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.రాజయ్య, నాయకులు చంద్రశేఖర్, వెంకటేష్ గౌడ్, ప్రభాకర్ రావు, వీరభద్రం, సుధాకర్‌గౌడ్, జాయింట్ సెక్రెటరీ నరసింహ గౌడ్, ఆర్గనైజర్ సెక్రెటరీ దేవేందర్, ట్రెజరర్ రవి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ హుస్సేన్, వీరేష్, గోపాల్ రెడ్డి, కార్మికులు రవీందర్‌రెడ్డి దుర్గారావు, దశరథరావు, హమాలీ యూనియన్ నాయకులు సాయిలు, కృష్ణ, యాదగిరి, రాములు, రాజు, సత్యం, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరి ముంపు కాలనీల్లో సిపిఎం పాదయాత్ర

- పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో భద్రాచలానికి పొంచి ఉన్న ప్రమాదం
- ప్రారంభ సభలో వక్తల ఉద్ఘాటన
- పాదయాత్రను ప్రారంభించిన రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గోదావరి ముంపు నుంచి భద్రాచలం రక్షణకు ముందస్తు చర్యలు చేపట్టాలని, పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో భద్రాచలానికి ప్రమాదం పొంచి ఉందని సిపిఎం నేతలు అన్నారు. ముంపు కాలనీలలో సిపిఎం పాదయాత్రను శనివానం రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్ ప్రారంభించారు. ప్రారంభ సభ భద్రాచలం ఎఎంసి కాలనీలో పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సభలో బండారు రవికుమార్, నియోజకవర్గ కో కన్వీనర్ కారం పుల్లయ్య ప్రసంగించారు. పోలవరం ముంపు నుంచి భద్రాచలానికి ప్రమాదం పొంచి ఉందని తమ పార్టీ 2007లోనే హెచ్చరించినా పాలకవర్గాలు పెడచెవిన పెట్టాయని విమర్శించారు. గత ఏడాది వరదలు భద్రాచలం పట్టణ ప్రజలను భయాందోళనకు గురిచేశాయన్నారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ముఖ్యమంత్రి సైతం వచ్చి భద్రాచలం రక్షణకు చర్యలు చేపడతామని మాటలు చెప్పి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. భద్రాచలంలో గెలిచిన అధికార, ప్రతిపక్ష ప్రజాప్రతినిధులు ముంపు విషయంలో నోరు మెదపకపోవడం సరికాదన్నారు. గతంలో సిపిఎం ప్రజాప్రతినిధులు వరదల సమయంలో ప్రజలకు అండగా నిలిచారని తెలిపారు. పోలవరం జాతీయ ప్రాజెక్టు కాబట్టి కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకొని రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో చర్చించి భద్రాచలం ముంపు సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గోదావరి కరకట్టకు మరమ్మతులు చేయాలని, కట్టకు ఉన్న స్లూఈజ్‌లు రిపేరు చేయించి సమర్థవంతమైన మోటార్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. మొదటిరోజు పాదయాత్ర భద్రాచలం ముంపు కాలనీలు ఎఎంసి కాలనీ, అశోక్ నగర్ కొత్త కాలనీ, రెవెన్యూ కాలనీ, అయ్యప్ప కాలనీలలో కొనసాగింది. పాదయాత్రకు నియోజకవర్గ కో కన్వీనర్ కారం పుల్లయ్య సారథ్యం వహించగా.. బృందంలో పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, కార్యదర్శివర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి, ఎం.రేణుక, సున్నం గంగా, బి.వెంకటరెడ్డి, బండారు శరత్ బాబు, వై.వెంకట రామారావు, పి సంతోష్ కుమార్, నాదెల్ల లీలావతి ఉన్నారు. ప్రారంభ సభలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు, ఎ.జె. రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.బ్రహ్మాచారి, ఎంబి నర్సారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్, దొడ్డ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కెసిఆర్ జుటా, మోడీ జుటా దోనో మిల్కే దేశ్ కో లూటా

- టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ

ప్రజాశక్తి --హైదరాబాద్ బ్యూరో



వరంగల్ పర్యటనకు వచ్చిన ప్రధాని మోడీ పాత చింతకాయ పచ్చడిలాగా చెప్పినవే చెప్పారంటూ టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ ఎద్దేవా చేశారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన మాట్లాడారు. 'కేసీఆర్ జుటా, మోడీ జుటా దోనో మిల్కే దేశ్ కో లూటా' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి ప్రభుత్వం తెచ్చిన ప్రతి బిల్లుకు బిఆర్ఎస్ మద్దతిచ్చిందని విమర్శించారు. సిఎం కెసిఆర్ అవినీతి గురించి మాట్లాడుతున్న మోడీ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. దేశ సంపదను దోచుకోవడంలో బిజెపి, బిఆర్ఎస్ రెండూ ఒకటేనన్నారు. బిఆర్ఎస్‌ని ఓడిస్తామంటూ బిజెపి అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి కూడా చెప్పడం లేదని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి రావద్దనే కుట్రతోనే కాంగ్రెస్, బిఆర్ఎస్ ఒకటని మోడీ ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. బిఆర్ఎస్, బిజెపినీ తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు బొంద పెట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

మోడీ సభకు ముగ్గురు నేతల డుమ్మా

- కనిపించని వివేక్, విజయశాంతి, చంద్రశేఖర్
- ఎడమొహం, పెడమొహంగానే ఈటల, బండి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

బిజెపిలో కలహాల కాపురం అట్లాగే కొనసాగుతున్నది. ప్రధాని పర్యటన కూడా నేతలను ఒక్కతాటిపైకి తేలేకపోయింది. సభావేదికపై నేతలు ఎడమొహం, పెడమొహంగా ఉండటం స్పష్టంగా కనిపించింది. దానికి మించిన బిగ్ ట్విస్ట్ ఏమిటంటే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పర్యటనకు ముగ్గురు కీలక నేతలు డుమ్మా కొట్టారు. అందులో ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు వివేక్ వెంకటస్వామి, విజయశాంతి, మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్ ప్రధాని సభలో ఎక్కడా కనిపించలేదు. వీరు త్వరలో పార్టీ మారబోతున్నారని కొద్దిరోజులుగా ప్రచారం జరుగుతున్న విషయం విదితమే. బండి సంజయ్‌ని రాష్ట్ర అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పించడాన్ని ఆమె బాహాటంగానే ఖండించారు. బండిని తప్పించడం, ఈటలకు ప్రాధాన్యత ఇవ్వటంతో వివేక్ కూడా కొద్దిరోజులుగా అలకపాన్పు ఎక్కారు. మాజీ మంత్రి చంద్రశేఖర్ కూడా తనకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదనే బాధలో ఉన్నారు. త్వరలో వీరిలో ఇద్దరు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకోబోతున్నారనీ, ఒకరు కారెక్కబోతున్నారనే ప్రచారం ఇప్పటికే జోరుగా సాగుతున్నది. ప్రధానమంత్రి సభకు హాజరుకాకపోవడంతో ఆ ఊహాగానాలకు మరింత బలం చేకూర్చినట్లు అయింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ బహిరంగ సభలో ఈటల రాజేందర్, బండి సంజయ్ ఎడమొహం, పెడమొహంగానే ఉన్నారు. రఘునందన్‌రావుదీ అదే పరిస్థితి. వరంగల్ జిల్లాకు చెందిన సీనియర్ నేత చింతా సాంబమూర్తిని వేదికపైకి పిలవకపోవడమూ వివాదాస్పదమైంది. తన నియోజకవర్గంలో జరుగుతున్న సభలో తనను వేదికపైకి పిలవకపోవడం పట్ల ఆయన తీవ్ర అసంతృప్తికి గురైనట్టు ఆ పార్టీ వర్గాలే గుసగుసలాడుకుంటున్నాయి.

ధరణి రద్దు చేస్తాం

- కిసాన్ కాంగ్రెస్ నేత కోదండరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ధరణి పోర్టల్‌పై లోతుగా చర్చించిన తర్వాత దాన్ని రద్దు చేయాలని నిర్ణయించినట్టు కిసాన్ కాంగ్రెస్ జాతీయ నేత కోదండరెడ్డి చెప్పారు. పార్టీ అధికారంలోకి వచ్చినవెంటనే ప్రజలకు ఇచ్చిన హామీమేరకు దాన్ని రద్దు చేస్తామని పునరుద్ఘాటించారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఏ సంస్కరణలు తీసుకువచ్చినా బాధ్యతయుతంగా అమలు చేస్తామన్నారు. ధరణి రికార్డుల ప్రక్షాళనపై గ్రామ గ్రామాన తిరిగి హక్కుదారుల ఇబ్బందులను తెలుసుకున్నట్టు తెలిపారు. రెవెన్యూ నిపుణుల సలహాలమేరకే భూ డిక్లరేషన్ విడుదల చేసినట్టు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక టైటిల్ గ్యారంటీ తీసుకొస్తామన్నారు.